ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

శనివారం 31 అక్టోబర్ 2026

నీటిని వృథా చేస్తే రూ.5 వేల జరిమానా విధిస్తాం

నిబంధనలు ఉల్లంఘిస్తే నల్లా కనెక్షన్ తొలగింపు..

- మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య హెచ్చరిక

9లో

ఎండిపోతున్న వరి పంటలు.. రైతుల ఆవేదన

భూగర్భ జలాలు అడుగంటడంతో 60 ఎకరాల్లో ఎండిపోయిన చేలు

- ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోవడం, బోర్లు అడుగంటడంతో తీవ్ర నీటి కొరత
- అప్పులు చేసి సాగు చేసిన రైతులకు కోలుకోలేని దెబ్బ

వివరాలు 9లో..

క్రీడలతో ప్రపంచస్థాయి గుర్తింపు

ఆర్చరీలో తెలంగాణకు రెండు స్వర్ణ పతకాలు..

- క్రీడాకారిణి చికితకు రూ.4.32 కోట్ల ప్రోత్సాహం
- సుల్తానాబాద్ క్రీడలకు పుట్టినిల్లు
- రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు

5లో

దీపావళి కానుక పేరుతో సైబర్ మోసం

రూ.8 వేలంటూ వాట్సాప్‌లో నకిలీ లింకుల ప్రచారం

3లో

- ఆకర్షణీయమైన లింక్‌లు క్లిక్ చేస్తే ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిక
- బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచన

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8లో

- నూకలమర్రిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మరుగుదొడ్లు లేక ప్రయాణికుల అవస్థలు ?

- వారపు సంతకు వచ్చే వారికి తప్పని ఇబ్బందులు
- మహిళలు, వృద్ధులకు తప్పని సమస్యలు..
- సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, మహిళల వేడుకోలు

ఎండపల్లి, అక్టోబర్ 30, ప్రజా జ్యోతి:
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రయాణికులు, అలాగే ప్రతి మంగళవారం జరిగే వారపు సంతకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి వారం నిర్వహించే సంతకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు వ్యాపారులు, కొనుగోలుదారులు వస్తుంటారు. సంతకు వచ్చే వారితో పాటు వివిధ పనుల నిమిత్తం గ్రామానికి చేరుకునే ప్రయాణికులకు కూడా మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

మహిళలకు మరింత ఇబ్బంది

మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారపు సంతకు వచ్చి ఎక్కువ సమయం గడిపే వారు అత్యవసర సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

రాజారాంపల్లిలో వారపు సంతకు వచ్చే ప్రజలు, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ అధికారులు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణ, పరిశుభ్రతకు తగిన ఏర్పాట్లు చేయాలని ,సంబంధిత అధికారులు గ్రామపంచాయతీ పాలకవర్గం సమస్యను పరిశీలించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

ఎండిపోయిన నిమ్మతోటను పరిశీలించని అధికారులు

హార్టికల్చర్ శాఖ నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం

నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు డిమాండ్

జగిత్యాల, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):
జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామంలో ఉద్యానవన శాఖ అధికారుల వైఖరిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామానికి చెందిన రైతు మహేష్‌కు చెందిన నిమ్మతోటపై 'గ్రోమోర్' మందులు పిచికారీ చేయడంతో చెట్లు ఎండిపోయిన ఘటన జరిగి 20 రోజులు గడుస్తున్నా, స్థానిక ఉద్యానవన శాఖ అధికారులు ఇప్పటివరకు పరిశీలించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు, పోలాస పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్తలు తోటను పరిశీలించి సాంకేతిక వివరాలు సేకరించారు. అయితే నిమ్మ తోటల సాగు నేరుగా ఉద్యానవన శాఖ పరిధిలోకి వస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు కనీసం కన్నెత్తి చూడలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర నష్టాల్లో ఉన్న రైతును పరామర్శించడంలోనూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తోటి రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎండిపోయిన నిమ్మతోటను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గ్రామపంచాయతీలపై 'ఆర్టిఐ' అస్త్రం..

- నిధుల దుర్వినియోగంపై యువత గళం!
- "చేసేది మూరేడు... బిల్లెమో బారెడు!"
- రసీదు లేదు.. రాసింది లేదు..

మల్యాల, అక్టోబర్ 30,ప్రజా జ్యోతి :
ప్రజాధనం లూటీ అవుతున్న వేళ, సమాచార హక్కు చట్టంతో గ్రామాల్లో మార్పు తెస్తామంటున్న నేటి యువతరం .గ్రామ స్వరాజ్యం కల సాకారం కావడానికి ప్రభుత్వాలు కోట్లాది రూపాయలను గ్రామపంచాయతీలకు నిధులుగా కేటాయిస్తున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్న పరిస్థితులను యువత గమనిస్తూనే ఉంది . అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడటమే కాకుండా, కాగితాలపైనే కోట్లకు కోట్లు ఖర్చవుతున్నట్లు రికార్డులు సృష్టిస్తున్నారన్న వాదనలను యువత వినిపిస్తోంది . స్థానిక గ్రామపంచాయతీలలో సమాచారం అడిగితే రాజకీయ నాయకుల బరితెగింపు మాటలకు సమాధానంగా లెక్కల పక్కాలను ఆధారాలుగా చేసుకుని వారి గుట్టును రట్టు చేసే పనిలో యువత నిమగ్నమై ఉంది. మనల్ని ఎవర్రా ప్రశ్నించేది అనే వారికి చెంపపెట్టుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ, పల్లెల్లోని యువత సమాచార హక్కు చట్టంను శక్తిమంతమైన అశ్రంగా మలచుకుంటున్నారు.

చేసేది మూరెడు.... బిల్లేమో బారేడు....

గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, వీధి దీపాలు, ఇంకుడు గుంతలు, పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను, ఉపాధి హామీ పథకం నిధులను పెద్దఎత్తున మంజూరు చేస్తున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో పనులు నామమాత్రంగా జరుగుతుండగా, బిల్లులు మాత్రం తారాస్థాయికి చేరుతున్నాయి. చేసేది మూరెడు.... బిల్లేమో బారేడు.... అన్న చందంగా పనికి వ్యయానికి హద్దు పద్దు లేకుండా పోవడం గమనార్హం. గ్రామ పంచాయతీలలో ఇంటి పన్ను ఇతర ఇతర పన్నుల సేకరణ వివరాలను అదిగే నాథుడే కరువయ్యాడు. చాలా పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణ నామమాత్రంగా మారిపోయింది. ప్రజలకు తెలియకుండానే కాగితాలపై తీర్మానాలు రాసేసి, నిధులను స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీనికి తగ్గట్టుగా మట్టి మాఫియా కు అండగా నిలిచిన ఓ గ్రామానికి చెందిన ఉ పసర్పంచ్ జిపిఓ పట్టుకున్న జెసిబి,ట్రాక్టర్లను విడిపించడానికి గ్రామపంచాయతీ తీర్మానం అడ్డుపెట్టుకొని తాను అనుకున్న పనిని చేసుకోగలిగాడు అన్న విమర్శలు అప్పట్లో వినిపించాయి.

నిధుల దుర్వినియోగంపై యువత గళం

గ్రామపంచాయతీలోని దొంగ లెక్కలకు, అవినీతికి చరమగీతం పలకాలని నిశ్చయించుకున్న నేటి యువత ఇప్పుడు అధికార యంత్రాంగాన్ని ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ కార్యాలయాలను ఆశ్రయించి ఆర్.టి.ఐ దరఖాస్తుల ద్వారా పక్కా సమాచారాన్ని సేకరిస్తున్నారు. మండలంలోని తక్కళ్ళపెల్లి గ్రామ పంచాయతీలో పని చేసిన కార్యదర్శిలు నిధులను దుర్వినియోగం చేశారంటూ అదే గ్రామానికి చెందిన యువకుడు గళం విప్పాడు. తనకు పూర్తి సమాచారం కావాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా జిల్లా అధికారులు స్పందించారు. గత మంగళవారం తక్కళ్ళపెల్లి గ్రామ పంచాయతీలోని ఎంబి రికార్డ్స్ మెయింటెనెన్స్ బుక్ పూర్తి వివరాలను సేకరించిన జిల్లా అధికారులు నిధుల దుర్వినియోగం పై పూర్తి వివరణ కొద్ది రోజులలో ఇవ్వనున్నట్లు డిఎల్పిఓ విమలాదేవి తెలిపారు. అలాగే మల్యాల మేజర్ గ్రామపంచాయతీ నిధులలో అవకతకలు జరిగినట్లు అనుమానం వచ్చిన ఒక వ్యక్తి ఆర్థిక సంవత్సరానికి గాను లావాదేవీల సమాచారాన్ని ఇవ్వాలని ఎంపీడీవో స్వాతికి సమాచార హక్కు చట్టం క్రింద వివరణ కోరారు. సమాచారం యొక్క వివరణ పేజీలు ఎక్కువగా ఉండడంతో ఆ యొక్క ఖర్చు డిడి రూపంలో చెల్లించి సమాచారాన్ని పొందాలని అర్జీ పెట్టుకున్న వ్యక్తికి నోటీసు ద్వారా తెలిపినట్లు సమాచారం. తాటి పెల్లి గ్రామ పంచాయితీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు సమాచార హక్కు చట్టం కింద అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి సమాచారం కోరగా అందిన సమాచారం లావాదేవీలకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయని పై అధికారుల దృష్టికి తీసుకవేళ్తానని అ యువకుడు తెలిపాడు. దీనిని బట్టి గ్రామ పంచాయతీలలో జరుగుతున్న నిధుల దుర్వినియోగం పై యువత గళం విప్పడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

రసీదు లేదు.... రాసింది లేదు....

గ్రామపంచాయతీ కార్యదర్శులు కొందరు యువత అడిగే ప్రశ్నలకు నిమ్మకు నీరెత్తినట్లు ఉ ంటున్నారు. రసీదు లేదు రాసింది లేదు అన్న చందంగా వ్యవహరించడం పై గ్రామాల యువత,ప్రజలు మండిపడుతుంది.గ్రామ పంచాయతీ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చిన మొత్తం నిధులు ఎంత? వాటిని ఏయే పనులకు కేటాయించారు?పనుల అంచనాలు, రసీదులు, చేపట్టిన పనులకు సంబంధించిన ఎస్టిమేషన్ కాపీలు, సామగ్రి కొనుగోలు చేసినప్పుడు తీసుకున్న (జిఎస్టి) అసలు రసీదులు ఏవి? అనే ప్రశ్నలను సమాచార హక్కు చట్టం కింద సమాచారాన్ని సేకరించే పనిలో యువత ఉన్నట్లు సమాచారం.

గ్రామసభల రికార్డులు పనుల ఎంపికకు సంబంధించి నిర్వహించిన గ్రామసభల రిజిస్టర్లు, హాజరుపత్రాల ప్రతులు కార్యదర్శుల నుంచి కోరుతున్నట్లు తెలుస్తోంది. మేరీ గ్రామపంచాయతీ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన యాప్ లో గ్రామపంచాయతీ అధికారులు అప్లోడ్ చేసే లావాదేవీలను యువత గ్రహించి దానిపై సమాచారం కోరుతూ తప్పుడు సమాచారాన్ని నిగ్గు తేల్చే పనిలో ఉన్నారు.

మార్పు దిశగా తొలి అడుగు

రాజకీయాల వైపు దృష్టి సారించిన యువత రాజకీయ నాయకులను ప్రశ్నించడంపై దృష్టి పెట్టడంతో మార్పు దిశగా యువత తొలి అడుగు వేసినట్లు అయ్యింది. ఈ విధంగా లెక్కలు అడగడం ప్రారంభించినప్పటి నుంచే స్థానిక ప్రజాప్రతినిధుల్లో, అధికారుల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తాయి అన్న వాదనలు లేకపోలేదు .ఏ చిన్న పనైనా పారదర్శకంగా చేయకపోతే చట్టపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం వారిలో కలుగుతోంది. "ప్రజాధనం ప్రజల సంక్షేమం కోసమే ఖర్చు కావాలి కానీ, కొందరి జేబుల్లోకి వెళ్లకూడదు" అనే నినాదంతో యువత ముందుకు సాగుతుండటం పల్లెల్లో నూతన చైతన్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

గ్రామాల్లో అశ్రద్ధను రూపుమాపి, నిజమైన అభివృద్ధిని సాధించడంలో యువత చూపుతున్న ఈ చొరవ అభినందనీయం. లెక్కల అడుగులతో మొదలైన ఈ ప్రయాణం.. పారదర్శక పాలనకు బలమైన పునాది వేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అక్రమార్కులతో చేతులు కలపకుండా యువత నిజాయితీగా గ్రామాభివృద్ధి కోరుకుంటూ ముందుకు వెళితే నిధులు గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే అవకాశం లేకపోలేదు. దీనికి అనుగుణంగా జిల్లా స్థాయి అధికారులు గ్రామపంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమార్కుల ఆటలను అరికట్టే విధంగా సత్వర చర్యలను తీసుకోవాలని యువత గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

లోక పేటలో పౌర హక్కుల దినోత్సవం

ఎలిగేడు, అక్టోబర్ 30(ప్రజా జ్యోతి) :

గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా ఉండి అభివృద్ధి చేసుకోవాలని ఎలిగేడు తహశీల్దార్ యాకన్న అన్నారు. బుధవారం ఎలిగేడు మండల లో లోక పేట గ్రామ సర్పంచి అధ్యక్షతన గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ యాకన్న మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ కులస్తులపై కుల వివక్ష రెండు గ్లాసుల పద్ధతి అవలంబిస్తున్నారా అని తెలుసుకున్నారు. ఎవరైనా కుల విపక్ష అంటరానితనం చూపిస్తే చట్టపకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జమున వేణు మాధవరావు, ఎస్సీ వెల్ఫేర్ అధికారి అంజయ్య, ఏఎస్ఐ భాస్కర్, ఆర్ ఐ జయలక్ష్మి, జిపిఓ. సదానందం , పంచాయతీ కార్యదర్శి మసీద్దీన్, వార్డు సభ్యులు నరేంద్రావు, తిరుమలేష్ అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేనిదే
ఎలాంటి బోర్ లు వేయరాదు తహసల్దార్

ఇల్లంతకుంట అక్టోబర్30, (ప్రజా జ్యోతి) :

ఎలినివో ప్రభావం తో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలాన్ని కరువు మండలం గా ప్రకటిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినట్లు తహోసీల్దార్ రాచకట్ల సురేష్ కుమార్ శుక్రవారం రోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఎలినివో ప్రభావం దృష్ట్య మండలంలో అనుమతి లేనిదే నూతనంగా బోర్ లు వేయవద్దని, ఎవరైన వేసిన వాల్ల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. బోర్ వేల్ యాజమానులు రైతులు ఈ సమాచారం గుర్తించాలన్నారు.

ధూళికట్ట గ్రామంలో
విద్యుత్ శాఖ ముందస్తు చర్యలు

ఎలిగేడు అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):

మండలంలోని దూళికట్ట గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మర్ యాక్షన్ ప్లాను ప్రకారం, గ్రామ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు లో-వోల్టేజ్ సమస్యలను నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ధూళికట్ట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఛార్జింగ్ చేసి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ సంపత్ కుమార్, సర్పంచ్ మారం కొమురయ్య , లైన్ మెన్ భాస్కర్ వార్డు సభ్యులు మరియు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దీపావళి కానుక పేరుతో సైబర్ మోసం

రూ.8 వేలంటూ వాట్సాప్‌లో నకిలీ లింకుల ప్రచారం

- ఆకర్షణీయమైన లింక్‌లు క్లిక్ చేస్తే ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిక
- బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచన

కొనరావుపేట, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):

దీపావళి పండుగను పురస్కరించుకుని ప్రజలను మోసం చేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలకు పాల్పడుతున్నారు. పండుగ సీజన్‌ను ఆసరాగా చేసుకుని ప్రజలకు ఉచితంగా నగదు బహుమతులు అందిస్తున్నామంటూ నకిలీ సందేశాలను వాట్సాప్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా భారత ప్రభుత్వం దేశంలోని పౌరులందరికీ దీపావళి కానుకగా రూ.8 వేల నగదును ఉచితంగా అందిస్తోందని పేర్కొంటూ ఒక నకిలీ సందేశం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ సందేశాన్ని నమ్మి అందులో ఇచ్చిన లింక్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ప్రజలను హెచ్చరించింది.

లింక్ క్లిక్ చేస్తే వ్యక్తిగత సమాచారం చోరీ

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ పథకాలు, పండుగ కానుకలు, ఉచిత నగదు బహుమతుల పేరుతో ప్రజలను ఆకర్షిస్తూ వారి వ్యక్తిగత, బ్యాంకు వివరాలను సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయడం ద్వారా బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, యూపీఐ పిన్‌లు వంటి కీలక సమాచారాన్ని దొంగిలించి ఖాతాలను ఖాళీ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రముఖుల పేర్లు, ఫొటోలు, ప్రభుత్వ శాఖల చిహ్నాలను ఉపయోగించి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజలు వహించాల్సిన జాగ్రత్తలు

తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదని, ఉచిత బహుమతుల పేరుతో వచ్చే సందేశాలను నమ్మకూడదని సూచించారు. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, యూపీఐ పిన్‌లను ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని కేవలం అధికారిక వెబ్‌సైట్‌లలో మాత్రమే సరిచూసుకోవాలని కోరారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు ఫోన్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని అధికారులు సూచించారు.

బ్లూ బెల్స్ పాఠశాలలో స్టూడెంట్ కాన్ఫరెన్స్

- ఘనంగా సాగిన విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శన
- హాజరైన జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి

కరీంనగర్, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):

కరీంనగర్ హనుమాన్ నగర్‌లోని బ్లూ బెల్స్ హై స్కూల్‌లో నిర్వహించిన స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో జూతీఅఖ్మిఖీఎ విభాగానికి చెందిన సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఐదు పాఠ్యాంశాలకు సంబంధించి దాదాపు 140 విభిన్న ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించారు. ఈ ప్రదర్శనను జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ జంగా సునీత మనోహర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పరిశీలించారు. విద్యార్థులు తమ ఆలోచనలను ఆత్మవిశ్వాసంతో వివరిస్తూ, నేర్చుకున్న అంశాలను వినూత్న పద్ధతుల్లో ప్రదర్శించడాన్ని అతిథులు అభినందించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులలో సంస్కృతి, సంప్రదాయాలు, వ్యాకరణ అంశాలపై ఆకర్షణీయమైన ప్రాజెక్టులు రూపొందించారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో కార్యక్రమం విజయవంతమైంది.

వేములవాడ సమగ్ర అభివృద్ధే ధ్యేయం

- 38 ఎజెండా అంశాలకు మున్సిపల్ సర్వసభ్య ఆమోదం
- అవినీతిని ఆధారాలతో బయటపెడతాం: చైర్మన్ పుల్కం రాజు

వేములవాడ, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా సాగిన ఈ సమావేశంలో మొత్తం 38 ఎజెండా అంశాలకు ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ. వేములవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం అంకితభావంతో పనిచేస్తోందన్నారు. రాజన్న ఆలయ ప్రగతి కోసం రూ. 250 కోట్లతో పనులు జరుగుతున్నాయని, రూ. 6.50 కోట్లతో మెయిన్ రోడ్డు విస్తరణ, రూ. 1.40 కోట్లతో ప్రతిష్టాత్మక ఎంట్రన్స్ టవర్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఇటీవల నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలపై విమర్శలు చేసేవారికి ఘాటుగా బదులిచ్చారు. గత పాలకవర్గం కంటే వినూత్న రీతిలో ఉత్సవాలు నిర్వహించామని, పండుగను జీర్ణించుకోలేకే కొన్ని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తమకు అనుభవం లేదనే వారికి చేతల ద్వారానే సమాధానం చెబుతామని, గత ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలను త్వరలోనే ఆధారాలతో బయటపెడతామని హెచ్చరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు

కార్యకర్తకు అండగా కేటీఆర్..
వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

ముస్తాబాద్, అక్టోబర్ 30,(ప్రజా జ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి చాటుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త జల్ల భూమయ్య అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం కేటీఆర్ ఆర్థిక సహాయం అందించారు. కేటీఆర్ అందించిన ఆర్థిక సహాయాన్ని ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు భూమయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా భూమయ్య కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అవసరమైన సమయంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న కార్యకర్తకు వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించిన కేటీఆర్‌కు ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల సంక్షేమమే పార్టీ బాధ్యత అనే నినాదంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

వి.బి.జి.రాంజీ పథకం నిర్వహణపై మెట్ల పాత్ర కీలకం

ఎం.పీ.డీ.ఓ సురేందర్ కుమార్.

కాల్వ శ్రీరాంపూర్ అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): వి.బి.జి రాంజీ పథకం అమలు మెట్ల పాత్ర కీలకమని ఎంపీడీవో సురేందర్ కుమార్ అన్నారు. కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం రోజున. ఉపాధి హామీ పథకం మెట్లకు ఎంపీడీవో సురేందర్ కుమార్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మంజుల, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్ . ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి అభివృద్ధి పనుల కోసం మంత్రిని కలిసిన సర్పంచ్

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 30, ప్రజా జ్యోతి: ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి కి చెందిన గ్రామ సర్పంచ్ వివిధ అభివృద్ధి పనుల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు గ్రామంలోని గొల్లపల్లి నుంచి అక్క పెల్లి వరకు నాలుగు కిలోమీటర్ల మేరకు బీటు రోడ్డు నిర్మాణానికి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి బీటీ రాంజీ నిధులను శివాలయం నుంచి కొత్త కుంట వరకు సీసీ రోడ్డును నిధులను కేటాయించుట కొరకు కలెక్టర్కు లెటర్లాయించడం జరిగిందని గొల్లపల్లి సర్పంచ్ బండ రమేష్ గౌడ్ అన్నారు ఆయన వెంట గొల్లపెల్లి నాయకులు ఉన్నారు

మాజీ మావోయిస్టు కంకణాల రాజిరెడ్డికి ఇంటి స్థలం పట్టా అందజేత

కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని కిష్టంపేట్ గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి (అలియాస్ వెంకటేష్), ఆయన భార్య రాంకో (అలియాస్ ఈశ్వరి)లకు శుక్రవారం ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి స్థలం పట్టాను అందజేశారు. కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 597లో ఉన్న 250 చదరపు గజాల భూమి పట్టాను తహసీల్దార్ డాక్టర్ రాపల్లి రాముడు వారికి అందజేశారు. లోగడ లొంగిపోయిన మాజీ మావోయిస్టుల పునరావాసంలో భాగంగా ప్రభుత్వం ఈ స్థలాన్ని కేటాయించింది. కార్యక్రమంలో ఆర్ఐ వినోద్, జీపీఓ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రాకు ఘన సన్మానం

ఇల్లందకుంట, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): ఇటీవల ఇల్లందకుంట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) బాధ్యతలు చేపట్టిన రాజీవ్ మల్హోత్రాను శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఇంగిలే రామారావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇల్లందకుంట గ్రామపంచాయతీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవోకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇల్లందకుంట మండల అభివృద్ధికి, గ్రామాల పురోగతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంపీడీవో సమర్థవంతంగా కృషి చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రామారావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దార సురేష్, ధర్మకర్త గొడిశాల పరమేష్, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ప్రపంచస్థాయి గుర్తింపు

ఆర్చరీలో తెలంగాణకు రెండు స్వర్ణ పతకాలు..

- క్రీడాకారిణి చికితకు రూ.4.32 కోట్ల ప్రోత్సాహం
- సుల్తానాబాద్ క్రీడలకు పుట్టినిల్లు
- రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) :

క్రీడల ద్వారా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందడంతోపాటు రాష్ట్రానికి, దేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకురావచ్చని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. సుల్తానాబాద్ ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లుగా నిలుస్తోందని, ఇక్కడి నుంచి మరింతమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. శుక్రవారం సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారితో మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ పట్టుదలతో సాధన కొనసాగించాలని క్రీడాకారులకు సూచించారు.

చికిత విజయాలు స్ఫూర్తిదాయకం

పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తాన్పూర్ గ్రామానికి చెందిన ఆర్చరీ క్రీడాకారిణి చికిత ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించడం తెలంగాణకు గర్వకారణమని విజయరమణారావు అన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగిన క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. చికిత సాధించిన విజయాలు జిల్లాలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు. సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, నిరంతర సాధనతో ముందుకు సాగితే అంతర్జాతీయ స్థాయిలోనూ విజయాలు సాధించవచ్చని ఆమె నిరూపించారని కొనియాడారు. చికితకు రూ. 4.32 కోట్ల ప్రోత్సాహకం అందించడం క్రీడా ప్రతిభకు లభిస్తున్న గుర్తింపునకు నిదర్శనమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారిని చిన్ననాటి నుంచే గుర్తించి తగిన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం

రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పలు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను అభివృద్ధి చేయడం, ప్రతిభావంతులకు మెరుగైన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఖేలో ఇండియా క్రీడలను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా తెలంగాణలో క్రీడారంగానికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు క్రీడలను కేవలం వినోదంగా కాకుండా భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గంగా భావించాలన్నారు. క్రీడల వల్ల సమయపాలన, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు అలవడతాయని వివరించారు. పోటీల్లో ఓటమి ఎదురైనా నిరాశ చెందకుండా, తప్పులను సరిదిద్దుకుని తదుపరి పోటీలకు మరింత ఉత్సాహంతో సిద్ధం కావాలని సూచించారు.

నాలుగు జిల్లాల క్రీడాకారుల పోటీలు

సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీలకు నాలుగు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలు విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు మంచి వేదికగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. పోటీల నిర్వహణకు సహకరించిన నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.

పలువురు ప్రముఖుల హాజరు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమీర్‌శెట్టి తిరుపతి, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కనుకుంట్ల లక్ష్మణ్, జీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాధవీలత, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ తుల శోభారాణి, పీఈటీ అధ్యక్షుడు డాక్టర్ సురేందర్, కార్యదర్శి దాసరి రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, శ్రావణి రాకేష్, ప్రభాకర్, వరప్రదీప్, చింతల రాజు, గదాస్ రవీందర్, అబ్బాయి గౌడ్, కుమార్ కిషోర్, దామోదర్‌రావు, సాయిర మహేందర్, తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ గిన్నె లక్ష్మణ్, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వీర్‌పాల్, ప్రభాకర్, కుమార్, ఖాజాబీ, శైలజ, సంధ్య, శ్రీవాణి, రూపారాణి, నిర్మల, రాము, అనూప్, సాగర్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధి,

కార్తీక మాస ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష

వేములవాడ, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులు, రాబోయే కార్తీక మాస ఉత్సవాల ఏర్పాట్లపై హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామ్ అయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ధార్మిక అడ్వైజర్ గోవింద హరిల అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. కార్తీక మాసంలో శ్రీ భీమేశ్వరాలయం, రాజన్న ఆలయాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రత్యేక దర్శనాలు మరియు మౌలిక వసతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో ఆలయ ఈవో ఎల్. రమాదేవి అధికారులకు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్, ఆర్కిటెక్ట్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

రక్తదానం చేసి మరో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చు

- సుల్తానాబాద్‌లో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం
- వెయ్యి మంది రక్తదాతలను గుర్తించి ప్రోత్సహించాలి
- పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి

సుల్తానాబాద్, అక్టోబర్ 30:(ప్రజా జ్యోతి):
రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరో ముగ్గురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్ రెడ్డి అన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుల్తానాబాద్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీసీపీ భూక్య రామ్ రెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ఇతర వైద్య అత్యవసర సమయాల్లో రక్తం ఎంతో కీలకమని, సకాలంలో రక్తాన్ని అందించడం ద్వారా విలువైన ప్రాణాలను నిలబెట్టవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల దాతలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని, దానం చేసిన రక్తంలోని భాగాలు కొద్ది కాలంలోనే తిరిగి శరీరంలో ఉత్పత్తి అవుతాయని వివరించారు. రక్తదాన శిబిరాల్లో సాధారణంగా 250 నుంచి 300 మిల్లీలీటర్ల వరకు రక్తాన్ని సేకరించి అవసరమైన రోగులకు అందిస్తారని చెప్పారు. రక్తదానంపై యువతలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో రానున్న రోజుల్లో సుమారు వెయ్యి మంది రక్తదాతలను గుర్తించి, అవసరమైన సమయంలో రక్తం అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డీసీపీ సూచించారు. సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు గ్రామాలు, పట్టణాల్లో యువతను చైతన్యపరిచి రక్తదాతల వివరాలను సేకరించాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో రక్తం కోసం ఇబ్బందులు పడకుండా స్వచ్ఛంద రక్తదాతల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పొన్నమనేని రంజిత్ రావు, ఎస్ఐలు పి. చంద్రకుమార్, మధుకర్, సుధాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ సభ్యులు, పోలీస్ సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసేందుకు పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు రావడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

వృద్ధాశ్రమంలో 40 మంది వృద్ధులకు అన్నదానం

ముస్తాబాద్ అక్టోబర్ 30, (ప్రజా జ్యోతి):
మండే పెల్లి వృద్ధాశ్రమంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి సురేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుధమల్ల భువన జన్మదినాన్ని పురస్కరించుకుని వృద్ధాశ్రమంలోని 40 మంది వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమం ద్వారా జరుపుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. వృద్ధులకు ఆప్యాయతతో భోజనం వడ్డించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి సురేష్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి, గౌరీ సురేష్, ఏర్పుల వెంకటయ్య, గద్దల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో సరిహద్దులను పక్కాగా నమోదు చేయాలి

అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

వేములవాడ, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):
భూముల రీ సర్వేలో భాగంగా ప్రభుత్వ భూములు, పట్టా భూములకు సంబంధించిన అన్ని సరిహద్దులు, వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. వేములవాడ రూరల్ మండలం రుద్రవరం గ్రామంలో శుక్రవారం చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మధ్యమానేరు జలాశయానికి సంబంధించిన సరిహద్దులు, గ్రామంలోని పట్టా భూముల హద్దులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. రైతులకు రీ సర్వేపై అవగాహన కల్పించాలని, ఎలాంటి అపోహలు లేకుండా అధికారులకు సహకరించాలని కోర, పరిశీలనలో డీఐ రాజేంద్ర ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ లీలారాణి, నీటి పారుదల శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

మాజీ ఎంపీపీ చిలుక రవీందర్

చొప్పదండి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెకు చొప్పదండి తాజా మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య పరిరక్షణ, తల్లీబిడ్డల సంరక్షణ, వ్యాధుల నివారణ, ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలులో ఉద్యోగులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ భద్రత, వేతనాలు, సర్వీసు సంబంధిత సమస్యలు తదితర అంశాలపై ఉద్యోగులు చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడే ఆరోగ్య సిబ్బందికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని,

ప్రస్తుతం సమ్మె చేస్తున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని కోరారు. ఆరోగ్య సిబ్బంది సంక్షేమం, ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం రెండూ పరస్పరం ముడిపడి ఉన్నాయని ఆయన అన్నారు. ఉద్యోగులకు తగిన గుర్తింపు, గౌరవం, భద్రత కల్పించినప్పుడే వారు మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించగలుగుతారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం

కాంగ్రెస్ నాయకుడు గాదె శివరాం

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ 4వ డివిజన్ అధ్యక్షుడు గాదె శివరాం అన్నారు. శుక్రవారం 4వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన నూతన ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివరాం మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. డివిజన్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారంతో పాటు డివిజన్ అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మోరపాక మంజుల, శ్రీనివాస్, మురళి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మంగళపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

చొప్పదండి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): చొప్పదండి మండలం మంగళపల్లిలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల భారాస ప్రభుత్వంలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందించడంతో పాటు సన్న బియ్యంతో వారి కడుపు నింపుతున్నామన్నారు. ఎమ్మెల్యే సత్యం కృషి, పట్టుదలతో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు దూసుకెళ్తుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాబోవు రోజుల్లో తీవ్రమైన కరువు ఏర్పడనుందని, నీటి నిలువలు తగ్గి సాగునీటికి తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ఎల్నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించడానికి నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటలను సాగుచేయాలని కోరారు. అనంతరం అధికారులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంగళపల్లి సర్పంచ్ పెద్దెల్లి శారద సురేష్, ఉప సర్పంచ్ ఏవన్ రెడ్డి, ఆర్నకొండ సింగిల్ విండో చైర్మన్ ఎన్నం మనోహర్, చొప్పదండి మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస,

పిట్టల వెంకటేష్, కొలిమికుంట సర్పంచ్ చొక్కాల తిరుపతి, మాజీ సర్పంచ్ వెల్మ తిరుపతి రెడ్డి, వార్డ్ సభ్యులు, నాయకులు నెరుమట్ల మల్లేశం, వెల్మ కృష్ణ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సోమిడి శ్రీనివాస్,నల్లాల అఖిల్, బండారి రాజేష్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకుడు..

ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 30(ప్రజా జ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బాకుర్పల్లె గ్రామపంచాయతీ గ్రామ ఉపసర్పంచి కాంగ్రెస్ నాయకుడు మడిగెల రవీందర్ గుప్తా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి గ్రామంలోని పని అభివృద్ధి పనుల కొరకు నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించాడు అసంపూర్తిగా ఉన్న వాటికి అధిక నిధులు కేటాయించాలని కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు మంత్రి సానుకూలంగా స్పందించాడు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- నూకలమర్రిలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- ఏ గ్రేడ్ ధాన్యానికి మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్
- వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్, సాగునీటి సౌకర్యాల కల్పన
- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం

వేములవాడ, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):
రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, ప్రభుత్వం నేరుగా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలనే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని నూకలమర్రి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యంలో తేమ శాతం 17 శాతానికి చేరిన వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

25.25 లక్షల రైతు కుటుంబాలకు రుణమాఫీ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. సన్న వడ్లు సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, ఏకకాలంలో రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25.25 లక్షల రైతు కుటుంబాలకు రూ.20,650 కోట్ల రుణమాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని వెల్లడించారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నియోజకవర్గంలో 17 ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లను మంజూరు చేయించినట్లు చెప్పారు.

సాగునీటి ప్రాజెక్టుల వేగవంతం.. ఎల్‌నినోపై అప్రమత్తత

సాగునీటి రంగంలో మల్యాల, మరిపెల్లి, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని, కూడేలు మక్క కాలువల నిర్మాణానికి భూసేకరణ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఉంటుందనే హెచ్చరికల నేపథ్యంలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పంటకుంటల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని కరువు మండలాలను ఆదుకునేందుకు కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల నిధులు కోరుతున్నామని తెలిపారు.

ఓట్ల తొలగింపుపై కేంద్ర కుట్రను తిప్పికొడతాం

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలి
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్

వేములవాడ, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):
ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు కాపాడటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని, ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించి, తొలగించిన ఓట్లన్నింటినీ తిరిగి ఓటరు జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పిలుపు మేరకు నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరిగే భారీ నిరసన కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేక బస్సుల్లో తరలివెళు న్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడానికి, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

మరిమడ్లలో ఎండిపోతున్న వరి పంటలు.. రైతుల ఆవేదన

భూగర్భ జలాలు అడుగంటడంతో 60 ఎకరాల్లో ఎండిపోయిన చేలు

- ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోవడం, బోర్లు అడుగంటడంతో తీవ్ర నీటి కొరత
- అప్పులు చేసి సాగు చేసిన రైతులకు కోలుకోలేని దెబ్బ
- నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్న బాధితులు

కోనరావుపేట, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో నీరు అందక వరి పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర దిగ్భ్రాంతికి గురవుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోవడం, భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోవడంతో బోర్లు పోటెత్తక నీటి ఎద్దడి తీవ్రమైంది. సాగునీరు అందకపోవడంతో గ్రామంలో దాదాపు 50 నుంచి 60 ఎకరాల వరకు వరి పంటలు పొట్ట దశలోనే ఎండిపోయి రైతులకు భారీగా నష్టం వాటిల్లింది.

చేతికొచ్చే వేళ తీరని శోకం

వరి పంటలు ఏపుగా పెరిగి చేతికందే సమయంలో నీటి సమస్య తలెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకోవడానికి ఎంతో ప్రయత్నించినప్పటికీ బోర్లలో నీళ్లు పడకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు గురికావడంతో చేసేదేమీ లేక కళ్లముందే పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. సాగు కోసం విత్తనాలు, ఎరువులు, దుక్కి, కూలీల రూపంలో ఎకరాకు వేలాది రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు రూపాయి కూడా తిరిగొచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆదుకోవాలి

వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే మరిమడ్ల గ్రామంలో పర్యటించి, ఎండిపోయిన వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరుతున్నారు. నీటి కొరతతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించి తగిన పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మరిమడ్ల గ్రామ రైతులు వేడుకుంటున్నారు.

నీటిని వృథా చేస్తే రూ.5 వేల జరిమానా విధిస్తాం

నిబంధనలు ఉల్లంఘిస్తే నల్లా కనెక్షన్ తొలగింపు..

మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య హెచ్చరిక

పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 30, ప్రజా జ్యోతి: ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య సూచించారు. నీటిని అనవసరంగా వృథా చేస్తే ఉపేక్షించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో ప్రతిరోజూ నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ, ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నీటి పొదుపునకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నల్లాల ద్వారా వచ్చే నీటిని అనవసరంగా వృథా చేయరాదని, తాగునీటిని డ్రైనేజీల్లోకి వదలడం వంటి చర్యలకు పాల్పడకూడదని సూచించారు. నీటిని వృథా చేస్తూ పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై మున్సిపల్ చట్టం--2019 ప్రకారం గరిష్టంగా రూ.5 వేల వరకు జరిమానా విధించడంతో పాటు, నల్లా కనెక్షన్ తొలగిస్తామని మున్సిపల్ చైర్మన్ నూగిళ్ళ మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ స్పష్టం చేశారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించి మున్సిపల్ యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని వారు కోరారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

- నిర్మల్‌లో ఈ నెల 31 నుండి పోటీలు
- మార్గదర్శి విద్యానికేతన్ విద్యార్థులకు అభినందనలు

కోనరావుపేట,అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు కొలనూరు గ్రామంలోని మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎస్. రక్షిత, ఈ. అన్విత ఎంపికయ్యారు. ఈ నెల 31, నవంబర్ 1 తేదీల్లో నిర్మల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మండల చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రత్యేక ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే నైపుణ్యం పెంపొందుతాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిభను చాటాలని సూచించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. క్రీడాకారులను తీర్చిదిద్దిన పీఈటీ ధర్మేందర్‌తో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

ఎలిగేడు ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ మేట్లకు శిక్షణ

ఎలిగేడు, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): ఎలిగేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ వి బి జి రాంజీ పథకానికి సంబంధించి మేట్లకు శుక్రవారం అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భాస్కరరావు మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల నిర్వహణ, కొలతల నమోదు, పనుల నాణ్యత పర్యవేక్షణ మరియు పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా వివరించారు. కూలీలకు కేటాయించిన పనులను సక్రమంగా పర్యవేక్షిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా పనులు జరిగేలా కృషి చేయాలని మేట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సత్యనారాయణ, ఎంపీఓ కిరణ్, ఏపీఓ సదానందం, టీఏ రంజిత్, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు మండల సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట మండలంలో 'షీ టీమ్' అవగాహన సదస్సు

ఎల్లారెడ్డిపేట,అక్టోబర్ 30(ప్రజా జ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం 'షీ టీమ్' ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. రాజన్నపేట ఎంపీయూపీఎస్, అల్మాస్‌పూర్ జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ తథా అక్కపల్లి ఎంపీయూపీఎస్ పాఠశాలలను సందర్శించిన షీ టీమ్ బృందం, ఈవ్‌టీజింగ్ లేదా వేధింపులకు గురైతే నిర్భయంగా 87126 56425 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించింది. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, రవి, సిబ్బంది శ్రీలత, శ్రీనివాస్‌తో పాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరెడ్డిపల్లిలో పౌర హక్కుల దినోత్సవం

గంగాధర, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): గంగాధర మండలంలోని కాచిరెడ్డిపల్లి (చిరెడ్డిపల్లి) గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అంబటి రజిత మాట్లాడుతూ, భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులను కల్పించిందని తెలిపారు. సమాజంలో కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోలా మమతరాణి, ఎస్సై బి.వంశీకృష్ణ, ఏపీఎం కుమారస్వామి, మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గంగాధర్ ప్రవీణ్, దళిత నాయకుడు ధ్యావ శ్రీనివాస్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

సామల సత్యనారాయణకు సన్మానం

మంథని, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): బీసీ అసోసియేషన్ పెద్దపల్లి సర్కిల్ లైజన్ ఆఫీసర్‌గా నూతనంగా నియమితులైన సామల సత్యనారాయణను మంథని ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డీఈఈ ప్రభాకర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు పలువురు అధికారులు, సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని డివిజన్ ఆపరేషన్ ఏడీఈ రమేష్, మంథని ఏడీఈ శ్రీనివాస్, గోదావరిఖని ఆపరేషన్ ఏడీఈ రాజశేఖర్, సబ్ ఇంజనీర్ కార్తీక్ తో పాటు పలువురు సబ్ ఇంజనీర్లు, ఏఈలు, బీసీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టించకండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ప్రజల్లో కాంగ్రెస్ నాయకులు లేనిపోని అపోహలు సృష్టిస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఓటర్ల సవరణలో భాగంగానే సర్వే ప్రక్రియలు కొనసాగుతున్నాయని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎన్నోసార్లు చేపట్టారని గుర్తుచేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను అయోమయానికి గురిచేయడం సరికాదని హితవు పలికారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకుడు తిరుపతి రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెద్దరాతుపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెద్దరాతుపల్లి గ్రామంలో రూ. 5 లక్షల నిధులతో చేపట్టే నూతన సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన పనులకు భూమిపూజ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజనవేణ సారయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బంగారు రమేష్, మాజీ సర్పంచులు ఓరుగంటి కొమురయ్య, మాదాసి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర వరద బాధితులకు
సత్యం పవర్ చేయూత

విద్యుత్ పునరుద్ధరణకు కార్మికులు, యంత్రాల పంపిణీ

మానవతా దృక్పథంతో స్పందించిన సంస్థ చైర్మన్ ప్రవీణ్

సుల్తానాబాద్, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు సత్యం పవర్ సిస్టమ్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే సంకల్పంతో సంస్థ చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తెలంగాణలోని కరీంనగర్ నుండి అవసరమైన విద్యుత్ మరమ్మతుల పనులు చేపట్టేందుకు నైపుణ్యం కలిగిన కార్మికులతో పాటు యంత్రాలు, పరికరాలను సమకూర్చి ఆంధ్రప్రదేశ్‌కు బృందాన్ని పంపించారు. కరీంనగర్ సూపరింటెండెంట్ అధికారి (ఎస్ ఈ) విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరదల కారణంగా దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించి బాధిత ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆపద సమయంలో మానవతా దృక్పథంతో స్పందించి సహకారం అందిస్తున్న సత్యం పవర్ సిస్టమ్స్ సంస్థను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ డీఈలు, ఏడీలు, ఏఈలు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిమ్మత్‌నగర్‌లో
ముగిసిన బోర్వెల్ రీఛార్జ్ పనులు

గంగాధర మండలంలోనే ఆదర్శంగా నిలిచిన గ్రామం

భూగర్భ జలాల పెంపకమే ధ్యేయమన్న సర్పంచ్

గంగాధర, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): భూగర్భ జలాల పెంపకమే ధ్యేయంగా గంగాధర మండలం హిమ్మత్‌నగర్ గ్రామంలో చేపట్టిన బోర్వెల్ రీఛార్జ్ పనులు శుక్రవారం విజయవంతంగా పూర్తయ్యాయి. అక్టోబర్ 24న ప్రారంభమైన ఈ పనులను రికార్డు సమయంలో పూర్తి చేసి, మండలంలోనే ఈ తరహా పనులను విజయవంతం చేసిన తొలి గ్రామంగా హిమ్మత్‌నగర్ నిలిచింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బీర్ల ఆనందం మాట్లాడుతూ రాబోయే తరాలకు నీటి కొరత లేకుండా చూడటమే తమ ప్రాధాన్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని పిలుపునిచ్చారు. బోర్వెల్ రీఛార్జ్ పద్ధతుల ద్వారా వర్షపు నీటిని వృథా కాకుండా నేరుగా భూమిలోకి పంపి, భూగర్భ జల మట్టాలను గణనీయంగా పెంచవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారుల సమర్థవంతమైన పర్యవేక్షణలో ఈ పనులు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏఈ జ్ఞానేశ్వరి, జేఈ సత్యం ప్రకాష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మమతతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ రక్షణ సేన మండల కమిటీల ఎన్నిక

ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడిగా కదిరే భాస్కర్

పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన నియామకాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఎల్లారెడ్డిపేట మండల నూతన కార్యవర్గాన్ని పార్టీ అధినేత్రి కవిత ఆదేశాల మేరకు సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజీద్ శుక్రవారం ప్రకటించారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఈ కమిటీని నియమించినట్లు తెలిపారు. మండల అధ్యక్షుడిగా కదిరే భాస్కర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కోడిముంజ బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బొమ్మనవేని పరుశరాములు, కోశాధికారిగా బైరి రాజేష్ ఎంపికయ్యారు. అలాగే ప్రెస్ రిలేషన్స్ అధికారిగా మారేపు భూశంకర్, అధికార ప్రతినిధులుగా మహమ్మద్ మహబూబ్ అలీ, పంజారి ప్రతిభ, భూపతి నియమితులయ్యారు. మహిళా విభాగం మండల అధ్యక్షురాలిగా కుల్లేరి మౌనిక, ప్రధాన కార్యదర్శిగా షేక్ షబానా ఎంపికయ్యారు. ముస్లిం మైనారిటీ వింగ్ మండల అధ్యక్షుడిగా సయ్యద్ హాజీబాబా, ప్రధాన కార్యదర్శిగా మొహమ్మద్ షాదుల్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా నూతన ప్రతినిధులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. తమ నియామకానికి సహకరించిన అధినేత్రి కవిత, ఇన్చార్జ్ మజీద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణకు రూ.50 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము

ఇల్లందకుంట అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ రాష్ట్రం ఎదుర్కొనే వాతావరణ సవాళ్లను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ. 50 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము డిమాండ్ చేశారు. ఇల్లందకుంట మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని, కరీంనగర్ జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. వెంటనే కరీంనగర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి, రైతాంగాన్ని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులతో రైతులకు ఎకరానికి రూ. 50 వేల చొప్పున పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సాగునీరు, తాగునీటి సమస్యల పరిష్కారంతో పాటు వ్యవసాయ రంగ పరిరక్షణకు, రైతు కూలీల ఉపాధి భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రైతులకు పంటల సాగులో అవసరమైన సహాయం అందించడంతో పాటు పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ రుణాల మాఫీ వంటి ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. రైతాంగం ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లకుండా కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తెలంగాణకు రూ. 50 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని చెల్పూరి రాము డిమాండ్ చేశారు

ఆసుపత్రుల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలి

- వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష
- 15వ ఆర్థిక సంఘం నిధుల పనులపై ఆదేశం

సిరిసిల్ల, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): జిల్లాలో నూతన ఆసుపత్రుల భవన నిర్మాణ పనులను ప్రణాళిక ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల నిర్మాణం, జిల్లా కేంద్రంలోని జీజీహెచ్, ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీల్లో వసతుల కల్పనపై సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీరాజ్, టీజీఎంఐడీసీ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మంజూరైన 16 సబ్ సెంటర్లలో 7 పూర్తయ్యాయని, రుద్రంగి పీహెచ్‌సీ భవన పనులు తుది దశకు చేరుకున్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తుది దశలో ఉన్న భవన నిర్మాణ పనులను అన్ని వసతులతో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. వేములవాడ, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట ఆసుపత్రుల్లో వైద్య యంత్ర పరికరాలు, సామగ్రి అమర్చే పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఈఈ సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సూపరింటెండెంట్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీ ఎల్లారెడ్డిపేట మండల నూతన కమిటీ ఎన్నిక..

ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 30(ప్రజా జ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం రోజున టిఆర్ఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక చేశారు మండల అధ్యక్షుడిగా కదిరే భాస్కర్ గౌడ్. మహిళా మండల అధ్యక్షురాలుగా కులేరి మౌనిక ముస్లిం కమిటీ మండల అధ్యక్షుడిగా హాజీ బాబా తెలంగాణ రక్షణ సేన పార్టీ ఎల్లారెడ్డిపేట మండల నూతన కమిటీని ఆ పార్టీ అధినేత కవిత శు క్రవారం ప్రకటించినట్లు సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ మజీద్ తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా నియమించబడిన ఈ నూతన కార్యవర్గానికి మండలంలోని వివిధ స్థాయి నాయకులకు బాధ్యతలు అప్పగించినట్లు మజీద్ అన్నారు.

పార్టీ అధినేత కవిత ప్రకటన మేరకుఎల్లారెడ్డిపేట మండల కమిటీ వివరాలు ఇలా ఉన్నాయి:

మండల అధ్యక్షులు: కదిరే భాస్కర్ గౌడ్. మండల ప్రధాన కార్యదర్శి: కోడిముంజ బాబు. ఆర్గనైజింగ్ కార్యదర్శి: బొమ్మనవేని పరుశరాములు. మండల కోశాధికారి: బైరి రాజేష్. మండల ప్రెస్ రిలేషన్ అధికారి : మారేపు భూశంకర్. మండల స్పోక్ పర్సన్లు: మహమ్మద్ మహబూబ్ అలీ, పంజారి ప్రతిభ, భూపతి

మండల జాయింట్ సెక్రటరీలు:

జాయింట్ సెక్రటరీ - 1: సయ్యద్ లాల్ మహమ్మద్. జాయింట్ సెక్రటరీ - 2: బైరి సంధ్య. జాయింట్ సెక్రటరీ - 3: ఓర్సు అశోక్. జాయింట్ సెక్రటరీ - 4: బాయికాడి ఆంజనేయులు..మండల మహిళ అధ్యక్షురాలిగా కుల్లేరి మౌనిక, మండల ప్రధాన కార్యదర్శిగా షేక్ షబానా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రేణు యాదవ్, మండల కోశాధికారిగా లక్ష్మీ, మండల ప్రెస్ రిలేషన్ అధికారిగా కుల్లేరి దీప్తికుమార్, మండల జాయింట్ సెక్రటరీ-1 పుష్పలత, మండల జాయింట్ సెక్రటరీ-2 లాస్య, మండల జాయింట్ సెక్రటరీ-3 మహేశ్వరి, మండల జాయింట్ సెక్రటరీ- 4 రజిత, మండల స్పోక్ పర్సన్ అమూల్య, కమిటీ మెంబర్లుగా కవిత, సంగీత, లావణ్య లను ఎన్నుకున్నారు..

ఎల్లారెడ్డిపేట మండల ముస్లిం మైనారిటీ వింగ్ కమిటీ

మండల అధ్యక్షుడిగా సయ్యద్ హాజీబాబా, మండల ప్రధానకార్యదర్శిగా మొహమ్మద్ షాదుల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా షేక్ పున్ను, మండల ప్రెస్ రిలేషన్స్ అధికారిగా సయ్యద్ షరీఫ్, మండల కోశాధికారిగా షేక్ బషీర్,మండల సంయుక్తకార్యదర్శి-1 మొహమ్మద్ ఇబ్రహీం, మండల సంయుక్తకార్యదర్శి-2 షేక్ సమీర్, మండల సంయుక్త కార్యదర్శి-3 షేక్ గౌస్, మండల సంయుక్తకార్యదర్శి-4 సయ్యద్ మహీన్, మండల అధికార ప్రతినిధి షేక్ మౌలానా, మండల అధికార ప్రతినిధి షహానా అజ్మీ మండల కమిటీ సభ్యులు రష్మ అంజుమ్,సమీనా బేగం, మొహమ్మద్ అంకూస్, సయ్యద్ సాబీర్, మొహమ్మద్ తాహెర్, షేక్ జహంగీర్, మొహమ్మద్ మెహబూబ్, అబ్దుల్ రహీమ్, సయ్యద్ షాదాబ్ తదితరులను ఎన్నుకున్నారు.. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. పార్టీ అధినేత కవిత తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఎల్లారెడ్డిపేట మండలంలో తెలంగాణ రక్షణ సేన పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తామని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన టిఆర్ఎస్ అధినేత కవితక్క కు, అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ మజీద్ కు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన మండల నాయకులకు పార్టీ శ్రేణులు, అభిమానులు అభినందనలు తెలిపారు.

టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీలు

- విధుల నిర్వహణపై సిబ్బందికి సీపీ దిశానిర్దేశం
- ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని ఆదేశం

కరీంనగర్, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): కరీంనగర్ నగరంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, కేసుల పురోగతి, పోలీస్ సిబ్బంది పనితీరును సమీక్షించి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్‌ల నమోదు, పెండింగ్ కేసులు, రౌడీ షీటర్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదులను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం వహించవద్దని స్పష్టం చేశారు. నగర పరిధిలో నిరంతర పెట్రోలింగ్ చేపడుతూ నేరాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని, అనుమానితుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. ప్రజల్లో భద్రతా భావం కలిగించేలా ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. తనిఖీల్లో ఏసీపీ వెంకటస్వామి, సీఐ సృజన్ రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం,అక్టోబర్30(ప్రజాజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మధ్యాహ్నం సుమారు 1.30 గంటల సమయంలో బస్టాండ్ సమీపంలోని డివైడర్‌పై ఓ వ్యక్తి స్పృహలేని స్థితిలో పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది అతడిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎత్తు సుమారు ఐదు అడుగులు ఉంటుందని పోలీసులు తెలిపారు. చామనఛాయ రంగు కలిగిన అతడు లేత గులాబీ రంగు ఫుల్‌హ్యాండ్స్ టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు.మృతుడి వివరాలు తెలిసిన వారు కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌ను లేదా 8712670761, 8712574721

నంబర్లలో సంప్రదించాలని సిఐ రామచందర్ రావు కోరారు

చర్లపల్లి గ్రామ పంచాయతీ నూతన భవనానికి శాస్త్రోక్తంగా ద్వారబంధ స్థాపన



గంగాధర, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): గంగాధర మండలంలోని చర్లపల్లి (ఆర్) గ్రామాభివృద్ధికి కేంద్రబిందువుగా నిలిచే నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో భాగంగా శుక్రవారం శాస్త్రోక్తంగా ద్వారబంధ (గడప) స్థాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నూతన భవనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తోరణాలు కట్టి గడపను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎట్టెపు కనకయ్య మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు ఒకే చోట, మరింత వేగంగా అందించడమే ధ్యేయంగా ఈ నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వ విప్ విజయరమణారావు

- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ
- వడ్ల కొనుగోళ్లలో దళారుల మోసాలను సహించేది లేదు
- ప్రభుత్వ కేంద్రాల్లో మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్
- యాసంగిలో ఆరుతడి పంటలే సాగు చేయాలని పిలుపు

సుల్తానాబాద్, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పక్కా కార్యాచరణ రూపొందిస్తోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. శుక్రవారం సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (గ్రామజా) ఆధ్వర్యంలో చిన్నబొంకూర్, పేరుకపల్లి, రెబ్బలదేవ్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

దళారీల మోసాలపై కఠిన చర్యలు

ధాన్యానికి ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతులను మోసం చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు వ్యాపారులు అంతకంటే ఎక్కువ ధర ఇస్తే విక్రయించుకోవచ్చని, అయితే తక్షణమే నగదు చెల్లిస్తేనే ధాన్యం లోడ్ చేయాలని రైతులకు సూచించారు.

యాసంగిలో ఆరుతడి పంటలకే ప్రాధాన్యత

నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వచ్చే యాసంగి సీజన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయవద్దని, ఎస్సారెస్పీ నీటిని కేవలం తాగునీటికే వినియోగిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని, వారికి ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలతో పాటు మద్దతు ధర కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, సింగిల్ విండో చైర్మన్ గౌరవెల్లి మురళీధర్‌రావు, సీఈవో రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన

కోనరావుపేట, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మోడల్ స్కూల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు కోనరావుపేట మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మోడల్ స్కూల్స్‌ను విద్యాశాఖలో విలీనం చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని, సీపీఎస్ ఉద్యోగులకు డెత్ గ్రాట్యుటీ సౌకర్యం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సుదీర్ఘకాలంగా మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. టీజీటీ ఉపాధ్యాయులకు నోషనల్ బెనిఫిట్స్ కల్పించాలని, హెచ్‌బీటీ ఉపాధ్యాయులకు కనీస వేతనంగా రూ.35 వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కల్పించేలా హెల్త్ కార్డుల సౌకర్యాన్ని అమలు చేయాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ, తమ న్యాయమైన సమస్యలు చాలా కాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

రామడుగు, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) కిడ్నాప్ కు ప్రయత్నించిన గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బాధితులు శుక్రవారం ఆరోపించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ రామడుగు మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన బుర్ర శ్రీధర్ కుమారుడైన అభిషేక్ గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నాడు. శుక్రవారం పాఠశాల అనంతరం ఇంటికి వెళుతున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనం పై వచ్చి ఒకసారి గా అడ్డుకొని కాలర్ పట్టుకొని ఇష్టానుసారం కిడ్నాప్ చేస్తామని బెదిరించగా బాలుడు కేకలు వేయడంతో స్థానికులు వస్తారని అప్రమత్తమైన వ్యక్తులు అక్కడినుండి పరారయ్యారు. దీంతో బాలుడు ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు తెలుపగా తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా వ్యక్తులను గుర్తించినట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కిడ్నాప్ కు ప్రయత్నించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని బాధితుని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేధింపులపై మౌనం వద్దు.. ధైర్యంగా ఫిర్యాదు చేయండి

పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి: న్యాయమూర్తి రామగిరి స్వారిక

ధర్మారం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి న్యూస్): బాలబాలికలపై జరిగే లైంగిక నేరాలు, వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు రూపొందించిన పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నంది మేడారం కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి, జూనియర్ సివిల్ జడ్జి రామగిరి స్వారిక అన్నారు. సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నంది మేడారం బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఎవరైనా వేధింపులకు గురిచేసినా, ఇబ్బందికర సంఘటనలు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని అన్నారు. సమస్యలను దాచిపెట్టకుండా నమ్మకమైన పెద్దల సహాయం తీసుకోవాలని సూచించారు. పోక్సో చట్టం–2012 ద్వారా 18 ఏళ్లలోపు బాలబాలికలకు చట్టపరమైన రక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు. అనుచిత ప్రవర్తనను సహించకుండా, వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థినులకు సూచించారు. బాలల రక్షణ కేవలం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలికలు భయంలేని వాతావరణంలో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మారం ఎస్సై ఎంబడి. శ్రీకాంత్, నంది మేడారం అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లింగారెడ్డి, జాయింట్ సెక్రటరీ ఆకారి రాజేశం, ట్రెజరర్ నూనె సత్యనారాయణ, న్యాయవాదులు బల్ల సరిత, రావుల రజిత, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది సంతోష్, కోర్టు సూపరింటెండెంట్ చంద్రమౌళి, అడ్వకేట్ క్లర్క్ రమణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం పై నోటీసులు ఇచ్చిన అధికారులు

- పనులు ఆపని యజమానులు
- చోద్యం చూస్తున్న అధికారులు



గ్రామ పంచాయితి కార్యాలయం
మహాత్మానగర్
తిమ్మాపూర్ మండలం, జిల్లా: కరీంనగర్

అక్రమ నిర్మాణ నోటీసు

తేది 30/10/2026

విషయము: మహాత్మానగర్ గ్రామ పంచాయతి పరిధిలో మీరు అనుమతి లేకుండా ఇల్లు నిర్మాణం చేపట్టుచున్నారని తెలియజేయుటకు.

...

ఇందుమూలముగా మీకు అనగా శ్రీ/శ్రీమతి [illegible] s/o [illegible] గ్రామం: మహాత్మానగర్ మండలం: తిమ్మాపూర్ జిల్లా: కరీంనగర్ గార్కి తెలియజేయనది ఏమనగా మీరు గ్రామ పంచాయతి అనుమతి లేకుండా ఇల్లు నిర్మాణం చేపట్టినారు.

మీకు ఇంతవరకు పలుమార్లు మౌఖికంగా తెలియజేసినము.

కావున పం.రాజ్ ఆక్ట్ 2018 ప్రకారం సెక్షన్ 114 ప్రకారం అనుమతి లేకుండా మీ ఇంటిని నిర్మించుకున్న ఎడల మీఇంటిని కూల్చివేయబడును. ఇట్టి కూల్చివేతకు అయ్యే ఖర్చులు కూడా మీరే భరించావలెను.

కావున ఇట్టి నోటీసు ముట్టిన వెంటనే ఇల్లు నిర్మాణం పనులు నిలిపి వేసి గ్రామ పంచాయతి అనుమతి పొందిన అనంతరం ఇల్లు నిర్మాణ పనులు చేపట్టగలరు. లేనిచో పంచాయితీరాజ్ చట్టం నూతన ప్రకారం చర్యలు తీసుకొబడును.

పంచాయతి కార్యదర్శి

Scanned with OKEN Scanner

తిమ్మాపూర్అక్టోబర్ 30(ప్రజాజ్యోతి): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ గ్రామపంచాయతీ పరిధిలో అక్రమంగా నిర్మిస్తున్నటువంటి ప్రైవేట్ పనులకు పనులు జరగవద్దని గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ సదరు యజమానులు పనులు ఆపకుండా నిర్మిస్తున్న వైనం మహాత్మా నగర్ గ్రామపంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది అలాగే వాటర్ కనెక్షన్ అనుమతులుతీసుకోకుండా గ్రామపంచాయతీ నీళ్లను దుర్వినియోగం చేస్తున్నారని పూర్తి వివరాలలో తెలిసాయి ఇప్పటికి అయినా అధికారులు స్పందించి వెంటనే గ్రామపంచాయతీ నిధులను కాపాడాలని ప్రజలు తెలియపారు.

వార్డు సభ్యుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలకు సిద్ధం వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్

కొత్తపల్లి, అక్టోబర్ 30,(ప్రజా జ్యోతి):
తెలంగాణ రాష్ట్రంలో వార్డు సభ్యుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా నిరంతరం పోరాటం చేస్తున్నామని భవిష్యత్తులో కూడా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతున్నామని తెలంగాణ వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ పేర్కొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో నాలుగు రాష్ట్రాలలో వార్డు సభ్యులకు గౌరవ వేతనం అమలు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో వార్డు సభ్యులకు ఇతర ప్రజాప్రతినిధులకు ఇస్తున్న విధంగా గౌరవం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో వార్డు సభ్యులకు హెల్త్ కార్డులు జీవిత బీమా ఎవరైనా ప్రమాదంలో అకారణంగా మరణిస్తే వారికి 20 లక్షల బీమా ఇవ్వాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వార్డు సభ్యుల సంక్షేమ నిధిని 500 కోట్లతో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో వార్డు సభ్యులపై ఎవరైనా సర్పంచ్ లు దాడి చేస్తే వారిని సస్పెండ్ చేసే విధంగా కఠిన చట్టాలు తీసుకురావాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వార్డు సభ్యుల సంఘం కమిటీలు వేస్తున్నామని తమను ఈ 78427 00843 లకు సంప్రదించాలని నియామక పత్రాలు ప్రతి ఒక్కరికి అందిస్తామని తమతో కలిసి రావాలని వార్డు సభ్యుల ఐక్యతే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరం పోరాడితే భవిష్యత్తులో అనుకున్న లక్ష్యాలు సాధిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పబ్బ మహేష్, నాగుల సాంబయ్య, రాష్ట్ర నాయకులు గంగాధర వెంకటరమణ గంగాధర గంగ జమున, చొప్పదండి నియోజకవర్గం అధ్యక్షులు గొంటి సంజీవ్ కుమార్, గంగాధర మండల అధ్యక్షులు మేడి సుమన్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి ప్రళయ్ వర్మ, ఇతర వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ దళిత వింగ్ జిల్లా అధ్యక్షుడిగా చంటి శ్రీనివాస్

కొత్తపల్లి, అక్టోబర్ 30,(ప్రజా జ్యోతి)
తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ కరీంనగర్ జిల్లా అనుబంధ విభాగాల కమిటీని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ప్రకటించడం జరిగింది. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా దళిత వింగ్ (జిల్లా దళిత వింగ్) అధ్యక్షుడిగా చంటి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు చంటి శ్రీనివాస్ మాట్లాడుతూ. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు, పార్టీ అగ్రనాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో దళిత సామాజిక వర్గాల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన తరపున నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, ఆశయాల సాధనకు శ్రేణులను ఏకోన్ముఖం చేస్తూ ముందుకు సాగుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. చంటి శ్రీనివాస్ నియామకం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు దళిత సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రెడ్డిపల్లిలో కొండచిలువ కలకలం

బస్టాండ్ సమీపంలోని పాత ఇంట్లోకి ప్రవేశించిన భారీ కొండచిలువ

స్నేక్ క్యాచర్ చాకచక్యంగా పట్టుకోవడంతో ఊపిరి పీల్చుకున్న గ్రామస్తులు

వీణవంక,అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):
కరీంనగర్ జిల్లా వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామంలో కొండచిలువ కలకలం రేపింది. గ్రామంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ ఇంట్లోకి కొండచిలువ ప్రవేశించడంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇంట్లో కొండచిలువను గమనించిన వారు వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన స్నేక్ క్యాచర్ అక్కడికి చేరుకుని ఎంతో చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నాడు. అనంతరం గ్రామస్తుల సహకారంతో కొండచిలువను జనావాసాలకు దూరంగా అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి సురక్షితంగా విడిచిపెట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కొండచిలువను ఎలాంటి హాని చేయకుండా సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధే లక్ష్యం..

చెక్‌పోస్టులో ఏఎంసీ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు!

కరీంనగర్ టౌన్ అక్టోబర్ 30(ప్రజా జ్యోతి)
కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని చెక్‌పోస్టులో ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసన్న డీఎం షాబుద్దీన్, సెక్రటరీ సయ్యద్ హమీద్ అలీ కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు వద్ద జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించి, విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. వ్యవసాయ మార్కెట్‌లో పారదర్శకతను పెంపొందించడంతో పాటు, మార్కెట్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందించడం, మార్కెట్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టడం, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఈ తనిఖీ ద్వారా స్పష్టమవుతోంది.

రైతుల సంక్షేమమే ధ్యేయం..

వ్యవసాయ మార్కెట్ అభివృద్ధే లక్ష్యం! రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆకుల నరసన్న పటేల్ నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు.

విశ్వకర్మలకు సామాజిక న్యాయం కల్పించాలి

కొత్తపల్లి అక్టోబర్ 30,(ప్రజా జ్యోతి) :
విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతీయులకు సామాజిక న్యాయం కల్పించాలని, వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్, ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బ్రహ్మశ్రీ పాములపర్తి వేణుగోపాల చారి అధ్యక్షతన శుక్రవారం కరీంనగర్‌లో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గౌరవ శ్రీ ఎర్రోజు భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల జిల్లాలకు చెందిన సంఘం అధ్యక్షులు, ప్రతినిధులు ముఖ్యులు పాల్గొని విశ్వకర్మ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చేసి కార్పొరేషన్ మరియు ఫెడరేషన్ ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం చే ఇండస్ట్రియల్ లోన్లు తదితర అంశాలపై చర్చించారు. విశ్వకర్మ వర్గానికి తగిన గుర్తింపు, కల్పించాలని రాజకీయ ప్రాధాన్యత, విద్యా, వైద్యం ఉపాధి కల్పించి అవకాశం కల్పించాలని అన్ని రంగాల్లో అవకాశాలు ఉండాలని ఇట్టి సమావేశంలో పిలుపునివ్వడం జరిగినది మరియు అర్హులైన అటువంటి వారికి ఇందిరమ్మ ఇండ్లు 55 సంవత్సరములు పైబడిన వారికి పెన్షన్లు మంజూరు చేసి తగిన గుర్తింపు కల్పించేందుకు సంఘం ఐక్యంగా పటిష్టంగా పనిచేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు. తమ హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాలికోజు నరసింహ చారి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నాంపల్లి సోమచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్రోజు రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కాసిపేట మురళి, నాగుర్ల మురళి పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు చాన గుండ నరేష్, అలాగే కరీంనగర్ జిల్లా 16 మండలాల అధ్యక్షులు గర్రెపల్లి శ్రీనివాస్, మాయోజుల వెంకటేశ్వర్లు, శ్రీమంతుల శ్రీనివాస్, గోగులకొండ సత్యనారాయణ, శ్రీరామోజు రామ్మూర్తి, హనుమంత చారి, జూపాక ఆంజనేయులు, పాములపర్తి రవీంద్ర చారి, మల్లాచారి, జవ్వాజి వెంకటలక్ష్మి, బీజాళ్ళ సుజాత, ఇమ్మడోజు భాగ్యలక్ష్మి, స్వరూప, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. మరియు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బిమోజుసురేంద్ర చారి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు చందనగిరి గోపాల్, ప్రధాన కార్యదర్శి సనుగుల సత్యం, కోశాధికారి కొలకాని శంకర్, శ్రీమంతుల సదాచారి తదితర సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు. విశ్వకర్మల ఐక్యత, హక్కుల సాధన, సామాజిక అభివృద్ధి లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో విశ్వకర్మలు అత్యధికముగా సమావేశంలో పాల్గొని సభను విజయవంతంచేశారు.

రాజన్న ఆలయ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- **దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్**
- **రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష**
- **వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

వేములవాడ, అక్టోబర్ 30:ప్రజాజ్యోతి:
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులకు సూచించారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల పురోగతిపై శుక్రవారం హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల పురోగతి, వివిధ దశల్లో ఉన్న పనులు, టెండర్ ప్రక్రియ, , భక్తులకు కల్పించాల్సిన మౌలిక వసతులు తదితర అంశాలపై సమీక్షించారు. ఇప్పటికే చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడంతో పాటు, మంజూరైన పనులకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయడంపై చర్చించారు. ఆలయ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సూచించారు. ఉన్నతాధికారుల సూచనలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు తెలిపారు. సమావేశంలో ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, దేవాదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

- రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం
- విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యం
- రోగులకు మెరుగైన వైద్య సేవలు, మౌలిక వసతులు కల్పిస్తామని భరోసా

రాయికల్, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేలా వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. శుక్రవారం రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శశికాంత్ రెడ్డి ఆసుపత్రిలో అందిస్తున్న ఓపీ, ఐపీ సేవలు, వైద్య వివరాలు మరియు కావలసిన మౌలిక వసతుల గురించి ఎమ్మెల్యేకు వివరించారు.

నాణ్యమైన వైద్యమే లక్ష్యం

సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుతో నిరుపేదలకు అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. తాను వృత్తిరీత్యా వైద్యుడిని అయినందున నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా ఎల్లప్పుడూ కృషి చేస్తానని స్పష్టం చేశారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

వార్డుల పరిశీలన.. రోగులతో పరామర్శ

అనంతరం ఆసుపత్రిలోని పలు వార్డులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న చికిత్స, సౌకర్యాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్, తహసీల్దార్ నాగార్జున, కౌన్సిలర్ తోపారపు స్రవంతి సురేష్, వైద్యులు రామకృష్ణ, శ్రీకాంత్, రజిత, రోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్, ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయ అధికారి వద్దేపల్లి భాస్కర్

మల్లాపూర్, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి : ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రైతులు యాసంగిలో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసి నీటిని పొదుపు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వద్దేపల్లి భాస్కర్ సూచించారు. పాత దామ్‌రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ వద్ద ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విదేశాల నుంచి వంట నూనెల దిగుమతులను తగ్గించేందుకు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, డ్రిప్, స్ప్రింక్లర్ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెసర, మినుము, నువ్వుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ డీడీ సుధాకర్, ఏడీఏ దండ రమేష్, తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శ్రీకాంత్, సర్పంచ్ రాజేశ్వరి, ఆత్మ చైర్మన్ వాకిటి భూమారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వీఓ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఎండపల్లి, అక్టోబర్ 30 ప్రజా జ్యోతి మండలంలోని పడకల్ గ్రామంలో మహిళా సంఘాల వీఓ (విలేజ్ ఆర్గనైజేషన్) భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బెడ్డల ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. భవనం అందుబాటులోకి వస్తే మహిళా సంఘాల సమావేశాలు, ఇతర కార్యకలాపాల నిర్వహణకు సౌకర్యంగా ఉండనుంది. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఏఈ పీఆర్ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి విజయ్, వీఓ అధ్యక్షురాలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ కారోబార్, ఫీల్డ్ అసిస్టెంట్, నిర్మాణ కాంట్రాక్టర్ ఆకుల ప్రవీణ్ కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాలువలో మురుగునీటికి అడ్డుకట్ట!

పైపుల తొలగింపునకు నీటిపారుదల శాఖ చర్యలు, అధికారులకు సమస్యను వివరించిన సర్పంచ్ సంగ రమేష్

ఎండపల్లి, అక్టోబర్ 30, ప్రజా జ్యోతి మండలంలోని రాజారాంపల్లి గ్రామ పరిధిలోని ఎస్సారెస్పీ డి83.బీ సాగునీటి కాలువలోకి మురుగుదొడ్ల మురుగునీరు చేరుతుందన్న విషయాన్ని యువత గ్రామపంచాయతీ పాలకవర్గం అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన గ్రామపంచాయతీ పాలకవర్గం కాలువలో మరుగు నీరు చేరకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కాలువలోకి మురుగునీరు విడుదలవుతున్న విషయాన్ని గ్రామ సర్పంచ్ సంగ రమేష్ ఎస్సారెస్పీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన నీటిపారుదల శాఖ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలువలోకి మురుగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్లను గుర్తించి గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో తొలగింపు చర్యలు చేపట్టారు. ఇకపై ఎవరైనా కాలువలోకి మురుగునీరు విడుదల చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కాగా సమస్య పై స్పందించిన సర్పంచ్‌కు గ్రామస్థులు యువత కృతజ్ఞతలు తెలిపారు

ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం ..!

రాయికల్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ అన్నారు. శుక్రవారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామపంచాయతీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి హాస్పిటల్ వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 138 మందికి కంటి పరీక్షలు చేయగా 56మందిని ఆపరేషన్ కోసం గుర్తించి రేకుర్తి కంటి హాస్పిటల్ కు వైద్యంతో సహ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సుమారు 3649 మందికి కంటి ఆపరేషన్లతో పాటుగా మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఉచిత వైద్య సేవలు అందించేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, కోశాధికారి సుధవేణి మురళి, మాజీ జడ్‌సిలు మోర హన్మాండ్లు, మ్యాకల రమేష్, టెక్నీషియన్ ప్రభాకర్, క్లబ్ సభ్యులు కొమ్ముల ఆదిరెడ్డి, మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, కొత్తపెల్లి రంజిత్, బొడగం అంజిరెడ్డి, సత్యనారాయణ, ఆడెపు రాంప్రసాద్, అశోక్, గ్రామీణ వైద్యులు శ్రీనివాస్, రొట్ట శ్రీధర్, మహేష్, విడిసి చైర్మన్ వెల్మల ప్రతాప్ రెడ్డి, సాయిరెడ్డి, సామల్ల వేణు, కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకి స్కాలర్ షిప్ అందించిన శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ

రాయికల్, అక్టోబర్ (ప్రజా జ్యోతి) నవగతి స్కీమ్ లో డ్రైవింగ్ ద్వారా కుటుంబాన్ని పోషించే ఓనర్ కం డ్రైవర్ అలాగే డ్రైవింగ్ చేసే వారి పిల్లల భవిష్యత్తు కొరకు పిల్లల చదువులకు సహాయపడేలా స్కాలర్షిప్ ని శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ కోరుట్ల బ్రాంచ్ వారు గురువారం రోజు భూపతిపూర్ హై స్కూల్లో బత్తిని శ్రావిక,బోగ వైష్ణవి,బొడ్డు అభిషేక్,అలవాల హరిత,బొడ్డు అక్షిత,నూకల సహజ,గోగుల ప్రదీప్తిలకు బ్రాంచ్ మేనేజర్ పరమేశ్వర్, బ్రాంచ్ కలెక్షన్ హెడ్ సంతోష్ కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ భీమరాజ్, ఏరియా ఎగ్జిక్యూటివ్ లోకేష్ ప్రధానోపాధ్యాయురాలైన రమణి సమక్షంలో విద్యార్థులకు అందించారు. రమని మాట్లాడుతూ.. నవగతి స్కీమ్ ద్వారా స్కాలర్షిప్ అందించిన శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీని అభినందించారు.కుటుంబ పోషణలో కొంత భారన్ని తగ్గించే ఇలాంటి మరిన్ని స్కీమ్లని శ్రీరామ్ ఫైనాన్స్ వారు తీసుకురావాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం మెజిస్ట్రేట్ వై. జానకి

బుగ్గారం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):

విద్యార్థి దశ నుంచే చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మొదటి శ్రేణి మెజిస్ట్రేట్ వై. జానకి సూచించారు. బుగ్గారం మండల కేంద్రంలోని శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలు, పోక్సో, సైబర్ నేరాలు మరియు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు లేదా పోలీసులకు తెలియజేసి క్రమశిక్షణతో చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్. శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ నక్క రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమి పూజ నిర్వహించిన దాత గిద్దె ధరణి, శ్రీనివాస్

గొల్లపెల్లి అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:

గొల్లపెల్లి మండలం శ్రీరాములపల్లె గ్రామంలోని దుర్గా భవాని ఆలయంకు ఒక స్టోర్ రూమ్ నిర్మించాలని కమిటీ సభ్యులు నిర్ణయం తీసుకోగా అమ్మవారి నవరాత్రుల దర్శనానికి వచ్చిన అమ్మ వారి భక్తులు, సమాజిక సేవకులు గిద్దె శంకరయ్య, కుమారుడు గిద్దె శ్రీనివాస్ ను కోరగా వెంటన్నే స్పందించి మాట ఇచ్చిన శ్రీనివాస్ శుక్రవారం ఉదయం 9:00 గంటలకు స్టోర్ రూమ్ నిర్మాణ పనులకు గాను భూమి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో స్థానిక సర్పంచ్, సాల్లూరి శోభన్ గౌడ్ ఉపసర్పంచ్, ప్రజాప్రతినిధులు మరియు అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్షులు, దీక్ష స్వాములు ఆలయ పూజారి కార్యక్రమంను నిర్వహించారు తదనంతరం అమ్మవారిని దర్శించుకుని అక్కడి భక్తులు మరియు ప్రజాప్రతినిధుల సమక్షంలో ఉత్సవ కమిటీకి రూ 1,16,000నగదును అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు అభినందనీయం

మల్లాపూర్, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు ఉన్నారని జర్నలిస్టుల సేవలు ఎనలేనివని కొత్త ధాం రాజ్ పల్లి గ్రామ సర్పంచ్ ఎగ్యారపు లింబాద్రి అన్నారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతనంగా ఎన్నుకోబడ్డ మల్లాపూర్ మండల ఐజేయు ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ బద్దం.నర్సారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శంకర్ రెడ్డి, యువజన నాయకులు రాకేష్ వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన చుక్క గంగారెడ్డి

జగిత్యాల, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు చోటుచేసుకున్నాయని తెలంగాణ జన సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి ఆరోపించారు. అర్హులైన పేదలను ఎల్-2, ఎల్-3 జాబితాల్లో చేర్చి అన్యాయం చేస్తున్నారని, కొందరు డబ్బులు వసూలు చేసేందుకు

ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు అందజేశారు. పూరి గుడిసెలు, రేకుల ఇళ్లు, అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేదలకు కూడా లబ్ధిదారుల ఎంపికలో అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. ఎల్--2, ఎల్--3 జాబితాల్లోని అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది అర్హులను ఎల్--1 జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అక్రమ వసూళ్ల ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన పేదలకు న్యాయం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని చుక్క గంగారెడ్డి హెచ్చరించారు.

ఆత్మీయ పరామర్శలు ఆపదలో ఉన్న వారికి అండగా ఎడమల భోజందర్ రెడ్డి

గొల్లపెల్లి అక్టోబర్ 30 ప్రజాజ్యోతి

గొల్లపెల్లి మండలం వెన్గుమట్ల గ్రామంలో పలువురిని ఆత్మీయంగా పరామర్శించిన ఎడమల భోజందర్ రెడ్డి గ్రామంలో వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను మరియు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురిని ఎడమల భోజందర్ రెడ్డి ఆత్మీయంగా పరామర్శించారు వారి ఆరోగ్య పరిస్థితులు కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు ఆపదలో ఉన్నవారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పించారు కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడం ప్రజలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఆయన తెలిపారు ఆయన పరామర్శతో బాధిత కుటుంబాలు మరియు గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశాయి

భూ ఆక్రమణపై సమగ్ర విచారణ చేపట్టాలి

ఎంఆర్ఓకు నడికుడ పాలకవర్గం ఫిర్యాదు

మల్లాపూర్, అక్టోబర్ 30 ప్రజా జ్యోతి

మండలంలోని పునరావాస గ్రామమైన నడికుడలో భూ ఆక్రమణపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు వెల్లడించాలని శుక్రవారం గ్రామ పాలకవర్గం ఎంఆర్ఓకు వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి చెందిన చంద నర్సారెడ్డి సర్వే నంబర్ 299/2లోని భూమిని అక్రమంగా ఆక్రమించారనే ఆరోపణలపై విచారణ జరపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. 1998లో సదరు సర్వే నంబర్‌లో ఎంత భూమిని డీ1 పట్టా కింద కేటాయించారు? నర్సారెడ్డికి ఆ భూమి ఎలా వచ్చింది? ఎవరి ద్వారా కేటాయించారనే వివరాలను వెల్లడించాలని కోరారు. అలాగే నర్సారెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులైన సందె జ్యోతి, సందె బాజమ్మ పేర్లపై వివిధ సర్వే నంబర్లలో ఉన్న భూముల వివరాలు, మొత్తం విస్తీర్ణాన్ని తెలియజేయాలని, భూ రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరారు.

గురుకులాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల టౌన్, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి):

మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా పరిధిలోని వివిధ గురుకుల పాఠశాలలు మరియు కళాశాలల్లో ఖాళీగా ఉన్న అతిథి (గెస్ట్) అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ చెరుకు సుస్మిత తెలిపారు. పి ఈ టీ (పురుషులు) బీర్‌పూర్ ,మెట్‌పల్లి బాలుర పాఠశాల, అతిథి ఆరోగ్య పర్యవేక్షకులు (పురుషులు) జగిత్యాల విలీన బాలుర జూనియర్ కళాశాల, అతిథి జూనియర్ లెక్చరర్ (భౌతిక శాస్త్రం - మహిళలు)రాజారం విలీన బాలికల జూనియర్ కళాశాలలో, అతిథి TGT (గణితం - మహిళలు) పెగడపల్లి (గొల్లపల్లి) బాలికల పాఠశాలలో ఉన్నాయని,పని కాలపరిమితి 6 నెలలు మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హత ధ్రువపత్రాలను నిర్ణీత గడువులోగా అందజేయాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9154102664 నంబర్‌ను సంప్రదించవలసిందిగా సూచించారు.

లంచం ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా...

ఎంపీతో రాజీనామా చేయిస్తారా? బీజేపీ నాయకులకు తాట్లవాయి సర్పంచ్ ఆకుల మల్లేశం సవాల్

రాయికల్ అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) :

తనపై చేసిన లంచం ఆరోపణలను నిరూపిస్తే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని తాట్లవాయి సర్పంచ్ ఆకుల మల్లేశం బీజేపీ నాయకులకు సవాల్ విసిరారు. ఆరోపణలు నిరూపించలేకపోతే ఎంపీతో రాజీనామా చేయిస్తారా? అని ప్రశ్నించారు. శుక్రవారం రాయికల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ

విమర్శలు చేయవచ్చని, వ్యక్తిగతంగా లంచం ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సహకారంతో తాట్లవాయిలో మహిళా భవనం నిర్మాణం పూర్తయిందని తెలిపారు. గ్రామంలోని చారిత్రక రామాలయం, హనుమాన్ ఆలయాలకు ఎంపీ నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. ఎంపీ గెలిచి ఏడేళ్లు గడిచినా నిధులు మంజూరు చేయలేదని సభలో ప్రస్తావిస్తే, తన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు వక్రీకరించారని ఆరోపించారు. ప్రజాప్రతినిధిగా గ్రామాభివృద్ధికి నిధులు అడిగితే లంచం ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. తనపై చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. శనివారం ఉదయం 10 గంటలకు మహిళా సంఘం భవనం వద్దకు వచ్చి ఆరోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. ఆరోపణలు నిరూపించకపోతే జగిత్యాల నియోజకవర్గ నాయకురాలితో పాటు ఎంపీ రాజీనామాకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ గుజ్జుల మోహన్‌రెడ్డి, సర్పంచ్ బెజ్జంకి మోహన్, నాయకులు కోల శ్రీనివాస్, తలారి రాజేష్, మోర హన్మండ్లు, సాయిరాజ్, లావుడ్య సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపుల ఐక్యతే లక్ష్యం

తెలంగాణ మున్నూరు కాపు సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్

జగిత్యాల టౌన్,అక్టోబర్30(ప్రజాజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా మున్నూరు కాపులందరినీ ఒకే వేదికపైకి తెచ్చి సామాజికంగా బలోపేతం చేయడమే తమ లక్ష్యమని తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అన్నారు. శుక్రవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 51 లక్షల వరకు ఉన్న మున్నూరు కాపులను, తాజా కులగణనలో కేవలం 13 లక్షలుగా చూపించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవ జనాభా గణాంకాల సేకరణకు డిజిటల్ వెబ్‌సైట్ ద్వారా ప్రతి ఒక్కరూ

(పుట్టిన బిడ్డ నుండి వృద్ధుల వరకు) సభ్యత్వం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపుల విద్యా, ఉద్యోగ, ఆర్థిక అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తగినన్ని నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సభ్యత్వ నమోదు పోస్టర్, వెబ్‌సైట్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు మరాఠీ సత్తన్న, చిట్ల రవీందర్, పుప్పాల రాజేష్, వంగల రమేష్ పటేల్, జక్కుల లింగారెడ్డి, దొనకంటి గంగాధర్, పాము సత్యం, ఎర్రం చందన్ కుమార్, అయ్యోరి సుధాకర్, జంగిలి రవి తదితరులు పాల్గొన్నారు.

గడ్డం భూమయ్యను పరామర్శించిన డా. బోగ శ్రావణి

రాయికల్, అక్టోబర్ 30(ప్రజా జ్యోతి) : రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ ఎలక్ట్రీషియన్ గడ్డం భూమయ్య గ్రామంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన జగిత్యాల ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి

డా. బోగ శ్రావణి ఆసుపత్రికి వెళ్లి గడ్డం భూమయ్యను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, చికిత్స అందిస్తున్న వైద్యులతో మాట్లాడారు. భూమయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షులు ఆకుల మహేష్, జగిత్యాల పట్టణ అధ్యక్షులు కాశెట్టి తిరుపతి, జిల్లా కార్యదర్శులు పాత రమేష్, ముత్యం రెడ్డి, కంటే భూమేష్, రవి కిరణ్, గంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యతనివ్వాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
- ఉపాధి హామీ లక్ష్యాల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- మార్చి నాటికి 100 శాతం పన్నుల వసూళ్లు పూర్తి చేయాలి

జగిత్యాల టౌన్, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టి, భూగర్భ జలాలను పెంపొందించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గొల్లపెల్లి, పెగడపెల్లి మండలాల్లో ఆయన పర్యటించి ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఎల్ నినో ప్రభావం దృష్ట్యా 'జలసిరి' కింద ఫామ్ పాండ్లు, స్టోన్ ట్రెంచెస్ (రాం), కాంటూర్ కందకాలు వంటి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. అనంతరం పెగడపెల్లి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి నిరంతరం ఉపాధి కల్పించాలని, గ్రామాల్లో శాశ్వత ఆస్తుల సృష్టికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే, గ్రామపంచాయతీల ఆదాయ వృద్ధి కోసం వచ్చే మార్చి నాటికి నూటికి నూరు శాతం పన్నుల వసూళ్లు పూర్తి చేసి, వాటిని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటన, సమావేశంలో జెడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, ఆర్డీఓ మధుసూదన్, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు తప్పనిసరి

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల టౌన్, అక్టోబర్30(ప్రజాజ్యోతి) రైతుల వివరాలను సమగ్రంగా అందుబాటులో ఉంచేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా 'ఫార్మర్ రిజిస్ట్రీ'లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా పంటల వివరాలు సేకరించి, భూములను జియో టాగింగ్ చేయాలని ఆదేశించారు. ప్రతీ నియోజకవర్గానికి ఒక పీపీసీఎస్ ద్వారా సీహెచ్‌సీ యూనిట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో కోతలు పెరగనున్నందున రైతులు నష్టపోకుండా ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను అన్ని వసతులతో (గోనె సంచులు, తూకం, తేమ యంత్రాలు) సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్, సివిల్ సప్లైస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భరణం కచ్చితంగా అందేలా చూడాలి

ఆర్డీవో షర్మిల

కరీంనగర్, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): వృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ కోసం ఆదేశించిన ప్రకారం వారికి అందాల్సిన నెలవారీ భరణం కచ్చితంగా, సకాలంలో అందేలా అధికారులు పర్యవేక్షించాలని కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) షర్మిల ఆదేశించారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సీడీపీవోలు, పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన కరీంనగర్ డివిజన్ కమిటీ సమన్వయ సమావేశం శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది.

ప్రతి నెలా భరణం అందుతున్నదీ లేనిదీ పరిశీలించాలి

ఈ సమావేశంలో ఆర్డీవో షర్మిల మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు కోర్టు లేదా ఆర్డీవో నుంచి ప్రతినెలా నిర్దేశించిన మొత్తాన్ని వారసులు ఆలస్యం లేకుండా చెల్లించేలా అధికారులు చూడాలన్నారు. గ్రామాలు, మండలాల వారీగా భరణం ఉత్తర్వులు అందుకున్న వారి వివరాలు సేకరించి పర్యవేక్షించాలని సూచించారు. ఒకవేళ భరణం అందకపోతే బాధ్యులైన పిల్లలు లేదా వారసులతో మాట్లాడి ఆ మొత్తాన్ని ఇప్పించాలని తెలిపారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

తల్లిదండ్రుల వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కరించాలి: డబ్ల్యూసీడబ్ల్యూఓ సరస్వతి

జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి మాట్లాడుతూ.. భరణం కోసం వృద్ధులైన తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అధికారులే నేరుగా వారి వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆదేశించినా భరణం చెల్లించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి నెల మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీడీపీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.